సాక్షి
సిద్దిపేట
మంగళవారం । 25 । జూన్ । 2024



జూనియర్ డాక్టర్ల సమ్మె

రెగ్యులర్‌గా స్టైఫండ్ చెల్లించాలని, న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని జూనియర్ డాక్టర్లు సమ్మెకు దిగారు.

వివరాలు 8లో ▸



మహిళలకు భరోసా..

పోలీస్‌స్టేషన్, స్నేహిత కౌన్సెలింగ్ సెంటర్‌కు వచ్చే బాధిత మహిళలకు భరోసా కల్పించనున్నట్లు సీపీ అనురాధ తెలిపారు.

వివరాలు 8లో ▸



ఒంటికొస్తే ఇంటికే..

మిరుదొడ్డి సంతలో కనీస సౌకర్యాలు కరువయ్యాయి. విక్రయదారులకు, వినియోగదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

విజయ డెయిరీ అధ్యక్షుడిగా బాల్‌రెడ్డి



సమావేశంలో పాల్గొన్న డెయిరీ డైరెక్టర్లు

హుస్నాబాద్: విజయ పాల ఉత్పత్తిదారుల పరస్పర సహాయక సహకార సంఘం అధ్యక్షుడిగా కాయిత బాల్‌రెడ్డిని మూడోసారి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘంలో ఇద్దరు డైరెక్టర్ల పదవీ కాలం ముగియగా ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికల్లో కొత్త డైరెక్టర్లుగా సాంబరాజు, కంభం రవీందర్ గెలుపొందారు. అనంతరం తొమ్మిది మంది డైరెక్టర్లు అధ్యక్షుడిగా బాల్‌రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆ తరువాత రైతులతో కలిసి సంఘ మహాసభ నిర్వహించారు. సభలో సంఘం లాభనష్టాలు, రైతుల సమస్యలను చర్చించి పలు అంశాలపై తీర్మానం చేశారు. డెయిరీలో అత్యధికంగా పాలు పోసిన రైతులకు ప్రథమ, ద్వితీయ బహుమతులు అందజేశారు.

ఇంటర్ అడ్వాన్స్‌డ్‌లో 48 శాతం ఉత్తీర్ణత

సిద్దిపేట ఎడ్యుకేషన్: ఇంటర్మీడియెట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షా ఫలితాల్లో జిల్లాలో 48శాతం ఉత్తీర్ణత నమోదైంది. సోమవారం వెలువడిన ఫలితాల్లో ప్రథమ సంవత్సరంలో 2,169 మంది బాలురకు 1,111 మంది, 2,453 మంది బాలికలకు 1,538 మంది ఉత్తీర్ణత సాధించారు. మొత్తంగా 4,622 మంది విద్యార్థులకు 2,649మందితో 57శాతం ఉత్తీర్ణత నమోదు చేశారు. ద్వితీయ సంవత్సరంలో 807 మంది బాలురు, 631 మంది బాలికలు ఉత్తీర్ణత సాధించారు. మొత్తంగా 1,438 మందితో 48శాతం ఉత్తీర్ణత నమోదైంది.

మల్లన్న ఆలయ ఉద్యోగులకు మెమోలు

కొమురవెల్లి(సిద్దిపేట): మల్లికార్జున స్వామి ఆలయ ఉద్యోగులకు మెమోలు జారీ అయ్యాయి. ఏఈఓ శ్రీనివాస్, ఏఈ అంజయ్య, ప్లంబర్ విజయకుమార్‌లకు సంజాయిషీ మెమోలు జారీ చేస్తూ ఈఓ బాలాజీ సోమవారం ప్రకటన విడుదల చేశారు. ఈఓ కార్యాలయంలో పరిపాలనా విషయంపై చర్చ జరిగే సమయంలో ఏఈఓ, ఏఈ, ప్లంబర్ ఒకరినొకరు దుర్భాషలాడుతూ ఘర్షణకు దిగిన విషయం విదితమే. స్పందించిన ఈవో పై ముగ్గురు ఉద్యోగులు మూడు రోజులలో సంజాయిషీ ఇవ్వాలని మెమో జారీ చేశారు. సంజాయిషీ సంతృప్తిగా లేనట్లయితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు

ఇదిలా ఉండగా.. ఆలయ ఏఈఓ శ్రీనివాస్, ప్లంబర్ సార్ల విజయ్‌కుమార్‌పై ఎలక్ట్రిషన్ ఏఈ అంజయ్య పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆదివారం విధుల్లో ఉండగా తనను అకారణంగా దూషిస్తూ కొట్టారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కానిస్టేబుల్ సస్పెన్షన్

సిద్దిపేటకమాన్: పట్టణ టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న రవీందర్‌ను సస్పెండ్ చేస్తూ సీపీ అనురాధ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇసుక లారీలు, ట్రాక్టర్ల వద్ద డబ్బులు వసూలు చేస్తూ అవినీతికి పాల్పడుతున్నట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ క్రమంలో విచారణలో ఆరోపణలు నిర్ధారణ కావడంతో సస్పెండ్ చేశారు.

ఆయిల్‌పామ్ సాగుకు ప్రోత్సాహక నిధులు

జిల్లా ఉద్యాన శాఖ అధికారి సువర్ణ

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట):ఆయిల్‌పామ్ తోటలు సాగు చేస్తున్న రైతులకు ప్రోత్సాహక నిధులు విడుదలయ్యాయని ఉద్యానశాఖ జిల్లా అధికారి సువర్ణ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2022లో 1,770 మంది రైతులు 5,200 ఎకరాలలో సాగు చేసిన ఆయిల్‌పామ్ తోటలకు కేంద్ర ప్రభుత్వం రూ.1.76 కోట్ల నిధులను విడుదల చేసిందన్నారు.త్వరలో నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేస్తామన్నారు.

డాగ్‌స్క్వాడ్ బృందం తనిఖీలు



బెజ్జంకి(సిద్దిపేట): బెజ్జంకితో పాటు మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం డాగ్ స్క్వాడ్ తనిఖీలు చేపట్టింది. సిద్దిపేట కమిషనర్ ఆదేశాల మేరకు నిషేధిత గుట్కా, గంజాయి, ఇతర మత్తు పదార్థాల నివారణ కోసం జిల్లా కేంద్రం నుంచి వచ్చిన డాగ్ స్క్వాడ్ బృందం తనిఖీలు చేసినట్లు ఎస్‌ఐ కృష్ణారెడ్డి తెలిపారు. తనిఖీల్లో బెజ్జంకి పోలీస్ సిబ్బంది, బృందం సభ్యులు పాల్గొన్నారు.

తీరొక్క పంట.. సిరులే ఇంట!



కొత్త పంటల వైపు రైతుల అడుగులు

- మూస పద్ధతికి స్వస్తి
- పుదీనా, పప్పుదినుసులు, బంతి, కర్జూర సాగు
- ఏడాదంతా దిగుబడి
- పెట్టుబడి తక్కువ.. ఆదాయం ఎక్కువ

మారుతున్న కాలానికి అనుగుణంగా రైతులు కొత్త పంటల వైపు అడుగులు వేస్తున్నారు. సంప్రదాయ వరి పంటకు స్వస్తి పలికి ప్రత్యామ్నాయ పంటలు సాగు చేస్తూ లాభాలు గడిస్తున్నారు. పుదీనా, పప్పుదినుసులు, బంతి, కర్జూర వంటి వాటిపై ఆసక్తి చూపుతున్నారు. తక్కువ కాలం, పెట్టుబడితోపాటు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉన్న పంటలు వేస్తూ ఏడాదంతా ఆదాయం పొందుతున్నారు. దీంతో రైతుల ఇంట సిరులు కురుస్తున్నాయి. తీరొక్క పంటలపై నేటి నుంచి సాక్షి ప్రత్యేక కథనాలు. - వివరాలు 8లో..

బడులు బలోపేతం.. బోధన ఉన్నతం

విద్యార్థుల భవితే ముఖ్యం

- ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు
- సాంకేతిక విద్య, క్రీడలకు సముచిత స్థానం
- 'సాక్షి'తో డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి



ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): 'సర్కారు బడుల అభ్యున్నతికి విశేష కృషి చేస్తున్నాం. ఐదేళ్లుగా టెన్త్ ఫలితాల్లో రాష్ట్రంలోనే జిల్లా మొదటి, రెండు స్థానాల్లో నిలుస్తోంది. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులే అధికంగా 10 జీపీఏలు సాధిస్తున్నారు. చదువుతో పాటు క్రీడల్లోనూ ముందువరుసలో నిలుస్తున్నారు. విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు ఇదే అంకిత భావంతో పనిచేసి మరింత మెరుగైన ఫలితాలు సాధిస్తాం' అని డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. నూతన విద్యాసంవత్సరం ప్రణాళిక, విద్యారంగం ఎదుర్కొంటున్న సమస్యలు, ఉపాధ్యాయుల కొరత, నూతన పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు, మధ్యాహ్నభోజన నిర్వహణ, అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీలు, మౌలిక సౌకర్యాలు తదితర అంశాలపై 'సాక్షి' చేసిన ఇంటర్వ్యూలో డీఈఓ ఇచ్చిన సమాధానాలు ఆయన మాటల్లోనే..

నాణ్యమైన విద్య, ఉత్తమ ఫలితాలే లక్ష్యం

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య విద్యార్థులకు అందుతోంది. అన్ని అర్హతలు కల్గిన ఉపాధ్యాయులు విద్యార్థులకు బోధన అందిస్తున్నారు. అందువల్లే టెన్త్ పలితాల్లో రాష్ట్రంలోనే జిల్లా ఉత్తమ ఫలితాలు సాధిస్తోంది. ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులే 10 జీపీఎలు అధికంగా సాధించారు. భాసర ట్రిపుల్ ఐటీకి అధికంగా ఎంపికవుతున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలి. ఉచిత విద్య, ఉదయం రాగి జావా, నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందిస్తున్నాం.

అభివృద్ధికి కృషి చేస్తున్నాం..

జిల్లాలో 980 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. వీటిలో 90వేల వరకు విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. విద్యతో పాటుగా వసతి, ఆహారం అందిస్తున్నాం. ఈ నెల 6 నుంచి 19 వరకు జిల్లా వ్యాప్తంగా విద్యాశాఖ ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమం నిర్వహించాం. ఇందులో 5,098 మంది విద్యార్థులను నూతనంగా అడ్మిషన్లు చేయించాం. ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేస్తున్నాం. విద్యార్థులకు బంగారు భవిష్యత్ ఇచ్చే విధంగా తీర్చి దిద్దుతున్నాం.

100 శాతం పాఠ్యపుస్తకాలు అందించాం

గురుకులాలు, కేజీబీవీలు, ఆదర్శపాఠశాలలు, ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులందరికీ ప్రభుత్వం తరఫున ఉచిత పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, యూనిఫాంలు అందించాం. పాఠశాల ప్రారంభం రోజే విద్యార్థులకు ఇచ్చాం.

మౌలిక సౌకర్యాలు పూర్తి చేస్తాం

ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న మౌలిక వసతులను అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా పూర్తి చేస్తున్నాం. ఇప్పటికే 814 పాఠశాలల్లో పూర్తి స్థాయిలో టాయిలెట్, తాగునీరు, విద్యుత్, ఫర్నిచర్, తరగతి గదులు, తదితర మౌలిక సౌకర్యాలను అందుబాటులోకి తీసుకువచ్చాం. ఈ నెల చివరి వరకు అన్ని పూర్తి చేసి అందుబాటులోకి తీసుకువస్తాం.

ప్రమోషన్లు పూర్తిచేశాం

లోక్‌సభ ఎన్నికలు పూర్తి కాగానే ఉపాధ్యాయుల ప్రమోషన్ల కార్యక్రమం చేపట్టి విజయవంతంగా పూర్తి చేశాం. సీనియారిటీ ప్రకారం హెచ్‌ఎంలు గెజిటెడ్ హెచ్‌ఎంలుగా, స్కూల్ అసిస్టెంట్లు హెచ్‌ఎంలుగా, ఎస్జీటీ (సెకండరీ గ్రేడ్ టీచర్)లు ఎస్‌ఏ (స్కూల్ అసిస్టెంట్)లుగా ప్రమోషన్లు పొందారు. ఇందులో ఎలాంటి పొరపాట్లు లేకుండా పూర్తి స్థాయిలో ఆన్‌లైన్ ద్వారా పారదర్శకంగా పూర్తి చేశాం. అదేవిధంగా ఎస్జీటీలను బదిలీలు చేసే ప్రక్రియ ప్రారంభం అయ్యింది. ఈ నెల చివరికల్లా ఈ కార్యక్రమాన్ని పూర్తి చేస్తాం. జూలై నెల నుంచి పూర్తి స్థాయిలో విద్యబోధన పైనే కేంద్రీకరించనున్నాం.

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలల్లో పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ విక్రయించుకునే వెసులుబాటును రాష్ట్ర ప్రభుత్వం కల్పించింది. అయితే పాఠశాలల నిర్వాహకులు విద్యార్థులకు ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు విక్రయించరాదు. ఒకవేళ విక్రయిస్తే వారిపై చర్యలు తీసుకుంటాం. అదేవిధంగా ప్రైవేట్ పాఠశాలల్లో యూనిఫాం, షూ, టైలు విక్రయించరాదు. విద్యాశాఖ నిబంధనలు అతిక్రమించకుండా, వ్యవహరించాలి. తమ పిల్లలకు పాఠశాలలో ఏమైనా ఇబ్బందులు ఉంటే తల్లిదండ్రులు స్థానిక మండల విద్యాధికారికి ఫిర్యాదు చేయాలి.

ప్రతి ఇంటికీ భగీరథ

తాగునీటికి అధిక ప్రాధాన్యం

- విద్యుత్ సమస్యలపై ప్రత్యేక ప్రణాళికలు
- విద్యా ప్రమాణాలు పెంచాలి
- జెడ్పీ చైర్మన్ రోజాశర్మ



స్టాండింగ్ కమిటీ సమావేశంలో జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ, సభ్యులు, అధికారులు

సిద్దిపేటజోన్: జిల్లాలో ఇంటింటికీ భగీరథ, విద్యుత్ సరఫరా, వసతుల విషయంలో ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ అన్నారు. సోమవారం రెండో రోజు స్టాండింగ్ కమిటీ సమావేశాల్లో భాగంగా పలు అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా శాఖల అధికారులకు ప్రత్యేక సూచనలు చేశారు. మహిళ, శిశు సంక్షేమ శాఖలో ఉన్న ఖాళీలను వెంటనే భర్తీ చేయాలన్నారు. మహిళా భవనానికి అవసరమైన వసతులు కల్పించాలన్నారు. నాణ్యతా ప్రమాణాలు వెలికితీసేందుకు ప్రత్యేకంగా శిక్షణ తరగతులు ఏర్పాటు చేయాలని సూచించారు. జిల్లాలోని సాంఘిక సంక్షేమ వసతి కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. విద్యార్థుల విద్యా ప్రమాణాలు పెరిగే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. పదో తరగతి ఫలితాల్లో జిల్లా మెరుగైన స్థానంలో ఉందని, సంబంధించిన గురుకుల అధికారులను అభినందించారు. రోడ్డు నిర్మాణ పెండింగ్ ప్రాజెక్టులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ నీళ్లు ఇవ్వాలని, అంగన్వాడీ, ప్రభుత్వ రంగ సంస్థలకు నీటిని అందించాలని సూచించారు. జిల్లాలోని ప్రాజెక్టుల ద్వారా రైతులకు సాగునీరు అందించాలని సంబంధించిన శాఖకు సూచించారు. ఈ సమావేశంలో జెడ్పీ సీఈఓ రమేశ్, జెడ్పీటీసీలు జ్యోతి, కవిత, రవీందర్ రెడ్డి, మంగ, ఆయా శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పర్యాటక కేంద్రంగా 'మహా సముద్రం'

సుందరంగా తీర్చిదిద్దుతాం: పొన్నం



మహా సముద్రం గండిని పరిశీలిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్, కలెక్టర్ మనుచౌదరి

హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్‌కు ఏడు కిలోమీటర్ల దూరంలోని మహా సముద్రం గండిని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ తెలిపారు. సోమవారం కలెక్టర్ మనుచౌదరితో కలిసి గండి పరిసరాలను పరిశీలించారు. చుట్టూ కొండల మధ్య ఏర్పడిన మహా సముద్రం గండిని చూసేందుకు చాలా ప్రాంతాల నుంచి ప్రజలు వస్తున్నారన్నారు. రోడ్ల సౌకర్యంతో పాటు హరిత హోటల్ నిర్మాణానికి పర్యాటకశాఖ అధికారులతో చర్చించి అభివృద్ధి చేస్తామని చెప్పారు. సర్వాయి పాపన్న గుట్టలు, భయన్న విగ్రహం ఇప్పటికీ గుట్టల్లో ఆనవాళ్లు ఉన్నాయని, వాటిని మన తర్వాత తరాలకు అందించడం మన కర్తవ్యమన్నారు. మహాసముద్రం గండిని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దితే కరీంనగర్, హన్మకొండ, సిద్దిపేట, జనగామ జిల్లాల నుంచి పర్యాటకులు వచ్చే అవకాశం ఉందన్నారు. వీరి వెంట మాజీ ఎంపీపీ ఆకుల వెంకట్, కౌన్సిలర్ వల్లపు రాజు ఉన్నారు.

మంత్రులను కలిసిన గజ్వేల్ అసమ్మతి నేతలు

గజ్వేల్: కాంగ్రెస్ అసమ్మతి నేతలు సోమవారం మంత్రులు దామోదర రాజనర్సింహ, తుమ్మల నాగేశ్వర్‌రావులను కలిశారు. కొన్ని రోజులుగా డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డికి వ్యతిరేకంగా టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి బండారు శ్రీకాంత్‌రావు, రాష్ట్ర కార్యదర్శి నాయిని యాదగిరి, గజ్వేల్ మండల శాఖ అధ్యక్షుడు మల్లారెడ్డి తదితరులు అసమ్మతి గళం వినిపిస్తున్న సంగతి తెలిసిందే. గజ్వేల్ మార్కెట్ కమిటీ కొత్త పాలకవర్గం ఎంపికలో నర్సారెడ్డి ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తూ వస్తున్నారు. ఇదే క్రమంలో మంత్రులను కలిశారు. అనంతరం వారు మాట్లాడుతూ మార్కెట్ కమిటీకి సంబంధించి పదవులు ఫైనల్ కాలేదనే విషయాన్ని మంత్రులు వివరించారన్నారు.

ప్రజావాణి అర్జీలపై ప్రత్యేక శ్రద్ధ

- అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్
- అధికారులకు దిశానిర్దేశం



అర్జీలు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్లు

సిద్దిపేటరూరల్: ప్రజావాణి అర్జీలపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నామని, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో నిర్వహించినా ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్, అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డితో కలిసి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్ మాట్లాడుతూ ప్రజలు అందిస్తున్న అర్జీలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అధికారులకు సూచించారు. సమస్యల పరిష్కారానికి ప్రజావాణి చక్కని వేదిక అన్నారు. భూ సమస్యలు, పెన్షన్, ఇళ్ల పలు రకాల సమస్యల పరిష్కారం కోరుతూ మొత్తంగా 71 అర్జీలు వచ్చాయన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో నాగ రాజమ్మ, డీఆర్డీఓ జయదేవ్ ఆర్యా, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

'మల్లన్న' నిర్వాసితులనూ ఆదుకోవాలి

- రుణమాఫీ వర్తింపజేయాలి
- ప్రత్యేక జీఓ వచ్చేలా సీఎంతో మాట్లాడండి
- రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డిని కోరిన నర్సారెడ్డి



వేం నరేందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న నర్సారెడ్డి, నిర్వాసితులు

గజ్వేల్: ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీ మల్లన్నసాగర్ బాధితులకు అందే అవకాశం లేనందువల్ల వీరి కోసం ప్రత్యేక జీఓ తీసుకువచ్చేలా కృషి చేయాలని డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డిని కోరారు. సోమవారం ముంపు బాధితులతో కలిసి వేం నరేందర్‌రెడ్డిని నగరంలో కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మల్లన్నసాగర్ ముంపు బాధితులు 2015 కంటే ముందు బ్యాంకుల్లో పంట రుణాలు పొంది ఉన్నారని, అప్పట్లోనే భూసేకరణ జరగడం వల్ల మాఫీ వర్తించలేదని వివరించారు. మల్లన్నసాగర్ రిజర్వాయర్ కోసం సర్వం త్యాగం చేసిన వీరికి ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీ వర్తించే విధంగా ప్రత్యేక జీఓ వచ్చేలా చొరవ చూపాలని కోరారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లాలన్నారు. దీనిపై స్పందించిన వేం నరేందర్‌రెడ్డి సీఎం దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.



జాబ్ మేళాకు తరలివచ్చిన నిరుద్యోగులు

జాబ్ మేళాకు భారీ స్పందన

- వేలాదిగా తరలివచ్చిన నిరుద్యోగులు
- త్వరలో మండల స్థాయిలోనూ నిర్వహణ: మంత్రి పొన్నం



ఉద్యోగ నియామక పత్రం అందజేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్: పట్టణంలో నిర్వహించిన జాబ్ మేళాకు అనూహ్య స్పందన లభించింది. రాష్ట్ర ప్రభుత్వ యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ జాబ్ మేళాను సోమవారం మంత్రి పొన్నం ప్రభాకర్, కలెక్టర్ మనుచౌదరి ప్రారంభించారు. నిరుద్యోగులు 6 వేలకు పైగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకున్నారు. దాదాపు 60కి పైగా కంపెనీలు ఉద్యోగాల కోసం ఇంటర్వ్యూలు నిర్వహించాయి. ఉద్యోగం కోసం మహిళలు పిల్లాపాపలతో వచ్చారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల వారికి త్వరలో మండల స్థాయిలో జాబ్ మేళా నిర్వహిస్తామన్నారు. గౌరవెల్లి ప్రాజెక్టును పూర్తి చేసి టూరిజంగా అభివృద్ధి చేస్తామన్నారు.

మంచి అవకాశం..

యువతకు జాబ్ మేళా మంచి అవకాశమని కలెక్టర్ మనుచౌదరి అన్నారు. ఇక్కడకు 60కి పైగా కంపెనీలు రావడం మంచి పరిణామమన్నారు. అందరూ నైపుణ్యంతో కావాల్సిన ఉద్యోగాలు పొందాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ రామ్మూర్తి, మున్సిపల్ చైర్ పర్సన్ ఆకుల రజిత, వైస్ చైర్ పర్సన్ అయిలేని అనిత, డీటీసీ అమీనా, డీవైఎస్‌ఓ నాగేందర్ తదితరులు ఉన్నారు.

5 వేలకు పైగా ఉద్యోగాలు

జాబ్ మేళాతో నిరుద్యోగుల కల నెరవేరిందని మంత్రి పొన్నం అన్నారు. హుస్నాబాద్‌లో నిర్వహించిన మెగా జాబ్ మేళా ముగింపు కార్యక్రమంలో మంత్రి మాట్లాడారు. విద్యార్హతలు, నైపుణ్యాలు కలిగిన 1,310 మంది నిరుద్యోగులకు తక్షణమే ఆర్డర్ కాపీలు ఇచ్చి ఉద్యోగాలు పొందారన్నారు. మరో 3,887 మందిని షార్ట్ లిస్ట్ తయారు చేశారన్నారు. వారిని ఆఫీస్‌లకు పిలిచి స్కిల్స్ నేర్పించిన తర్వాత ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నారని తెలిపారు. నర్సింగ్, ఫార్మసీ చదివిన వారికి అపోలో, యశోద, కామినేని ఆస్పత్రులు హుస్నాబాద్‌లో జాబ్ మేళా నిర్వహించాలని కోరుతామని మంత్రి తెలిపారు.

క్లుప్తంగా

మహిళలకు భరోసా..

సిద్దిపేట సీపీ అనురాధ



మాట్లాడుతున్న సీపీ అనురాధ

సిద్దిపేటకమాన్: భరోసా సెంటర్, మహిళా పోలీసు స్టేషన్, స్నేహిత మహిళా కౌన్సిలింగ్ సెంటర్‌కు వచ్చే బాధిత మహిళలకు భరోసా కల్పించే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు సిద్దిపేట సీపీ అనురాధ తెలిపారు. పోలీసు కమిషనర్ కార్యాలయంలో సీపీ సోమవారం బాధిత మహిళలతో సమావేశం నిర్వహించి వారికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నాబార్డు ద్వారా బాధిత మహిళలకు ఉచితంగా టైలరింగ్, బ్యుటీషియన్, కంప్యూటర్ ఆపరేటింగ్‌పై శిక్షణ ఇప్పించడం జరిగిందన్నారు. శిక్షణ సమయంలో వారికి ఉచిత భోజనం, వసతి సౌకర్యం కల్పించారన్నారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

తూప్రాన్: అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన పట్టణంలోని కరీంగూడ సమీపంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ శివానందం సోమవారం తెలిపిన వివరాల ప్రకారం.. రాజస్థాన్‌కు చెందిన కలురాం(41) ఐదు నెలల కిందట మేడ్చేల్ జిల్లా బోయిన్‌పల్లికి వచ్చి అద్దెకు ఉంటూ ఓ ప్రైవేట్ సంస్థ అలింజ్ ప్యాకర్స్ అండ్ మూవర్స్ నిర్వహిస్తున్నాడు. అప్పులు అధికం కావడంతో మనస్తాపంతో బస్సులో తూప్రాన్‌కు చేరుకున్నాడు. 44వ జాతీయ రహదారి పక్కన ఉన్న కరీంగూడ సమీపంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి మృతుడి వద్ద లభించిన గుర్తింపు కార్డుల ఆధారంగా కుటుంబ సభ్యులకు సమాచారం అందించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ మృతి

వర్గల్(గజ్వేల్): పురుగు ల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్సపొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన వర్గల్ మండలం అంబర్‌పేటలో జరిగింది. గౌరారం ఎస్‌ఐ శివకుమార్ కథనం మేరకు.. అంబర్‌పేటకు చెందిన దండు దుర్గేష్ (34) లారీ డ్రైవర్. ఇతడికి భార్య పూర్ణిమ, నాలుగేళ్లలోపు యుగంధర్, మన్విత్, దీపిక ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఈ నెల 13న కుటుంబం విషయంలో భార్యాభర్తలకు గొడవ జరిగింది. భార్యను కొట్టడంతో ఆమె పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో మనస్తాపానికి గురైన దుర్గేష్ 14న ఇంటి వద్ద పురుగుల మందు తాగాడు. వెంటనే అతడిని చికిత్స నిమిత్తం లక్ష్మక్కపల్లి ఆర్వీఎం ఆస్పత్రికి, ఆ తరువాత గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతుడి తండ్రి చంద్రయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఎంపీటీసీల ఆందోళన

మిరుదొడ్డి(దుబ్బాక): గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి కోసం స్టేట్ మ్యాచింగ్ ఫండ్ నిధుల ప్రొసీడింగ్ ఇప్పిస్తానని మిరుదొడ్డి ఎంపీపీ గజ్జెల సాయిలు మోసం చేయడంతో మిరుదొడ్డి, అక్బర్‌పేట-భూంపల్లి మండల పరిధిలోని ఎంపీటీసీలు సోమవారం ఆందోళనకు దిగారు. ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ గజ్జెల సాయిలు ఆధ్వర్యంలో అధికారులతో కలిసి ఎంపీటీసీలు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. స్టేట్ మ్యాచింగ్ గ్రాంట్‌లో రూ.17.89 లక్షల నిధులు ఉండగా ఒక్కో గ్రామానికి నిధులు కేటాయించేలా తీర్మాణం చేశారు. లంచ్ తర్వాత ప్రొసీడింగ్ కాపీలను ఇస్తానని చెప్పి వెళ్లిన ఎంపీపీ సాయంత్రమైనా రాకపోవడంతో నిరసన వ్యక్తం చేశాడు. అలాగే ఎంపీడీఓ గంగుల గణేశ్ రెడ్డితో వాగ్వాదానికి దిగి ఆందోళన చేపట్టారు. ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు చాట్లపల్లి బాలమల్లేశం గౌడ్ ఎంపీపీ గజ్జెల సాయిలుతో ఫోన్‌లో మాట్లాడి ప్రతీ గ్రామానికి నిధులు వచ్చే విధంగా చూస్తానని తెలపడంతో ఎంపీటీసీలు ఆందోళన విరమించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పోలీస్ రాజులు, ఎంపీటీసీలు, సుతారి నర్సింహులు, చెప్యాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

తీరొక్క పంట.. సిరులే ఇంట

కొత్త పంటల వైపు రైతుల అడుగులు



చిన్నశంకరంపేటలో పుదీనా సాగు

వ్యవసాయం..ఓ జీవన విధానం. అద్భుతంగా మార్చుకోవాలంటే మూస విధానం కన్నా వినూత్నంగా 'సాగి'తేనే ఫలితం ఉంటుంది. తీరొక్క పంటలు సాగు చేస్తేనే అధిక దిగుబడులు సాధించవచ్చు. మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటలు వేస్తే ఆర్థికంగా లాభాలు ఆర్జించవచ్చు. అక్కడక్కడా రైతులు సాగు చేసిన తీరొక్క పంటలపై ప్రత్యేక కథనం...

యువకుడి.. కొత్త ఒరవడి

చిన్నశంకరంపేట(మెదక్): పుదీనా పంటను సాగు చేస్తూ లాభాలు గడిస్తున్నారు చిన్నశంకరంపేట మండల కేంద్రానికి యువ రైతు గంట చంద్రం. సంప్రదాయ పంటలైన వరి, మొక్కజొన్నకు బదులుగా అధిక లాభం పొందేలా పంటల సాగు చేయాలనే తపనతో కొత్త కోణంలో ఆలోచించాడు ఈ యువరైతు. తన తండ్రి శంకరయ్య వ్యవసాయంతోపాటు కూరగాయల అంగట్లో కొత్తి మీర, పుదీనా విక్రయిస్తూ అదనపు ఆదాయం పొందేవాడు. ఇదే తన ఆలోచనకు నాంది పలికింది. తాను కొత్తిమీర, పుదీనా సాగుచేయాలనే తలంపుతో యూట్యూబ్‌తో పాటు హార్టికల్చర్ అధికారుల సలహాతో ముందుకు సాగాడు. కొత్తిమీర, పుదీనా సాగు చేస్తు లాభాలు ఆర్జిస్తూ ముందుకు సాగుతున్నాడు.

తక్కువ విస్తీర్ణం

పుదీనాను కేవలం 10 గుంటల సాగుభూమిలో వేశారు. రెండు నెలల్లో పుదీనా చేతికొచ్చింది. వరుసగా పుదీనాను తెంపుతూ విక్రయిస్తున్నారు. ఇలా తెంపిన తర్వాత నెల రోజుల్లో మళ్లీ ఎదుగుతుంది. సంవత్సర కాలం వరకు లాభాల వైపు తీసుకెళ్లింది. తక్కువ విస్తీర్ణంతో పాటు సాగునీరు తక్కువే పడుతుంది.

ఏడాదంతా లాభమే..



ఒకే ఒక సారి పంటసాగుకు పెట్టుబడి పెడితే ఏడాదంత పంట ఎదుగుతూ లాభం వస్తుంది. 10 గుంటల విస్తీర్ణంలో సాగు చేసి రూ.30 వేల వరకు పెట్టుబడి పెట్టాను. ప్రతీ నెలలో రూ.15 వేల నుంచి రూ.30 వేల వరకు ఆదాయం వస్తుంది. తాము స్వయంగా మార్కెట్‌కు తరలించి విక్రయించడంతోపాటు ఇతర కూరగాయల వ్యాపారులకు సైతం అందిస్తున్నాం.

– గంట చంద్రం, రైతు, చిన్నశంకరంపేట



ఒకే గ్రామంలో ముగ్గురు యువకులు

నర్సాపూర్ రూరల్: తక్కువ పెట్టుబడితో స్వల్ప కాలంలో పుదీనా పంటను సాగు చేస్తూ అధిక లాభాలు గడిస్తున్నారు నర్సాపూర్ మండలం చిప్పల్ తుర్తి గ్రామానికి చెందిన రైతు ఎండీ.ఆజమ్. తనకున్న 3 ఎకరాలతో పాటు కౌలుకు తీసుకున్న మరో 2 ఎకరాల్లో వరి, పుదీనా పంటలను సాగు చేస్తున్నారు. రెండు ఎకరాల్లో మూడు విడతలుగా పుదీనా సాగు చేస్తున్నారు. ఇతడితోపాటు అదే గ్రామానికి చెందిన ఇక్బాల్, అసిఫ్, మోహిన్ తక్కువ పెట్టుబడితో పుదీనా సాగు చేస్తూ మంచి లాభాలు గడిస్తూ ఇతర రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నారు.

తక్కువ పెట్టుబడితో..

కేవలం 30 రోజుల స్వల్ప కాల పంట అయిన పుదీనా సాగుకు పెట్టుబడి తక్కువే అవుతుంది. ఒక ఎకరంలో విత్తనాలకు రూ.1000, ఎరువులకు రూ.10 వేలు మొత్తం కలిపి పెట్టుబడికి ఎకరాకు రూ.20 వేలు అవుతుంది. పెట్టుబడి పోను ఏడాది పొడువునా ఎకరాకు రూ.80 వేల వరకు గిట్టుబాటు అవుతుందని రైతులు తెలిపారు.



ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన

నర్సాపూర్ డివిజన్ పరిధిలో ప్రధానంగా రైతులు వరి పంట సాగు చేస్తారు. పలుమార్లు కూరగాయలు ఇతర ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని అవగాహన కల్పిస్తున్నాం. కోతల బెడద కారణంగా వరి తప్ప ఇతర పంటలు సాగు చేసేందుకు రైతులు ముందుకు రావడం లేదు.

–సంధ్యారాణి, ఏడీఏ నర్సాపూర్



బతుకులను మార్చిన బంతి

చేగుంట(తూప్రాన్): కష్టం ఎక్కువయినా సరే లాభం సంపాదించాలనే ఉద్దేశ్యంతో రుక్మాపూర్ గ్రామంలో బంతిపూల సాగు ఎంచుకున్నారు రైతులు. నాలుగేళ్లుగా గ్రామంలో సగానికిపైగా రైతులు బంతిపూల సాగుతో లాభాలను పొందుతున్నారు. ఎకరా పొలంలో బంతి సాగు కోసం దాదాపు రూ.40 వేలు పెట్టుబడులు పెడితే రూ.80 వేలు నుంచి రూ.లక్షకు పైగా డబ్బులు వస్తున్నాయని రైతులు ఈ పంటే ఎంచుకున్నారు. బతుకమ్మ పండుగ నుంచి కార్తీకమాసం వరకు డిమాండ్ ఉండే సమయంలో రైతులు సులభంగా పూలను మార్కెటింగ్ చేస్తున్నారు.



కూలీలు కూడా అవసరం లేదు

బంతి సాగు కొంచెం కష్టమే అయినప్పటికీ లాభాలు వస్తున్నాయని బంతి సాగును ఎంచుకున్నాం. నాటిన నాటి నుంచి పూతకు వచ్చే వరకు వివిధ దశల్లో సస్య రక్షణ చర్యలు చేపట్టాల్సి ఉంటుంది. పూతకు వచ్చినప్పుడు సైతం మార్కెటింగ్ చేయడం కొంత కష్టంగానే ఉంటుంది. బంతిసాగు కోసం శ్రమ కూడా తక్కువగా ఉండటంతో రైతుకు సంబంధించిన కుటుంబీకులే పనులు చేసుకుంటే సరిపోతుంది.

– మ్యాకల రామచంద్రం, రుక్మాపూర్

పప్పుల సాగే భేష్

నారాయణఖేడ్: ఖేడ్ డివిజన్‌లో ఎనిమిదేళ్లుగా పత్తి పంటవైపు రైతులు అధికంగా మొగ్గు చూపుతూ ఆదాయ మార్గంగా ఉన్న పప్పు దినుసుల సాగును తగ్గించారు. కానీ ఈ ఏడాది పప్పుదినుసుల సాగును పెంచేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. మార్కెట్‌లో రెండేళ్లుగా పప్పుల ధరలు ఆశాజనకంగా ఉండడంతో ఈ పంటల సాగుతో రైతులు లాభాలను పొందుతున్నారు. మార్కెట్‌లో ప్రస్తుతం కంది పప్పు కిలో రూ.190, పెసర రూ.120, మినుము రూ.150 చొప్పున విక్రయాలు జరుగుతున్నాయి. నారాయణఖేడ్ డివిజన్ పరిధిలో ఖేడ్, మనూరు, కంగ్టి, కల్హేర్ ఉమ్మడి మండలాల్లో కంది 1,684 ఎకరాలు, పెసర 402, మినుము 538, సోయాబీన్ 1,763 ఎకరాల్లో సాగు చేశారు. మృగశిర కార్తె ప్రవేశించిన అనంతరం కురిసిన మొదటి వర్షాలకు ఈ మేరకు సాగు చేశారు. మరిన్ని వర్షాలు కురిసాక ఈ పంటసాగు నాలుగు రెట్లు పెరిగే అవకాశం ఉంది.



పైడిపల్లి గ్రామంలో మొలకెత్తిన పెసర

అవగాహన కల్పిస్తున్నాం

మార్కెట్లో పప్పుల ధరలు అధికంగా ఉండటంతో రైతులు ఆ పంటల సాగువైపు మళ్లుతున్నారు. రెండుమూడేళ్లుగా పప్పుల ధరలు అధికంగా ఉంటున్నాయి. సాగు విధానం, పాటించాల్సిన పద్ధతులపై అవగాహన కల్పిస్తున్నాం.

– శంకర్, వ్యవసాయ అధికారి, నారాయణఖేడ్

500 ఎకరాల్లో కంది



జిన్నారం(పటాన్‌చెరు): కంది పంటను సాగు చేసేందుకు రైతులు ఉత్సాహాన్ని చూపుతున్నారు. గుమ్మడిదల మండల వ్యాప్తంగా గడిచిన రెండేళ్ల కాలంలో కేవలం వంద ఎకరాల్లో మాత్రమే రైతులు కంది పంటను సాగు చేసేవారు. ప్రస్తుతం ఐదు వందల ఎకరాల్లో ఇక్కడి రైతులు కంది పంటను సాగు చేస్తున్నారు. ఇక్కడ నల్లరేగడి భూములు ఎక్కువగా ఉండటంతో కంది దిగుబడులు ఎక్కువగా వస్తున్నాయని రైతులు చెబుతున్నారు. ప్రతీ ఏటా 870 ఎంఎం సాధారణ వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా, వర్షాలు కూడా విస్తారంగా కురుస్తుండటంతో రైతులు కంది వైపు మొగ్గు చూపుతున్నారు. పండించిన పంటను మార్కెట్‌కు తరలించేందుకు ఇక్కడి రైతులకు సులువైన మార్గాలు ఉన్నాయి.

పదేళ్లుగా చేస్తున్నా

పదేళ్లుగా కంది పంటనే సాగు చేస్తున్నా. నష్టం మాత్రం లేదు. అధికారుల సూచనలు, సలహాలతో పంటను సాగు చేస్తుంటా. రైతులు కంది పంట వైపు దృష్టి సారిస్తే బాగుంటుంది. – నర్సింహ్మారెడ్డి రైతు, గుమ్మడిదల

నాలుగేళ్ల నుంచే సాగు..



జహీరాబాద్: జహీరాబాద్ ప్రాంతంలో కర్జూర పంట సాగవుతోంది. నాలుగేళ్ల కిందట రైతు వై.పురుషోత్తం సుమారు ఐదు ఎకరాల్లో కర్జూర పంటను సాగు చేశారు. ప్రస్తుతం మొదటి కాత వస్తోంది. జహీరాబాద్ ప్రాంతం కర్జూర పంట సాగుకు అనుకూల వాతావరణం ఉన్నట్లు వ్యవసాయ శాఖ అధికారులు పేర్కొంటున్నారు. పంట ఉత్పత్తులకు మార్కెట్లో మంచి ధర లభిస్తే మరింత మంది రైతులు మొగ్గు చూపే వీలుంది. దీంతో సాగు విస్తీర్ణం క్రమంగా పెరిగే అవకాశం ఉంది.

బావిలో దూకిన కూతురు..

కాపాడే క్రమంలో తండ్రి

- గజ్వేల్ మండలం మధిర గ్రామంలో ఇద్దరు మృతి
- తల్లితండ్రుల మధ్య గొవడ ఆపడానికి ప్రయత్నించిన కూతురు
- తండ్రి మందలించడంతో బావిలో దూకి బాలిక ఆత్మహత్య



షేక్ సిరాజ్(ఫైల్)



షేక్ రేష్మ(ఫైల్)

గజ్వేల్‌రూరల్: మద్యానికి బానిసైన భర్త రోజు తాగి వస్తుండడంతో దంపతుల మధ్య గొడవ జరిగింది. ఇది చూసిన కూతురు గొడవకు అడ్డురావడంతో తండ్రి మందలించాడు. దీంతో మనస్తాపానికి గురైన బాలిక బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. కూతురిని కాపాడే క్రమంలో తండ్రి సైతం బావిలో మునిగి మృతి చెందాడు. ఈ విషాదకర ఘటన సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలంలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. గ్రామస్తులు, బేగంపేట పోలీసుల కథనం మేరకు.. గజ్వేల్ మండలం మక్తమాసాన్‌పల్లి మధిర గ్రామం కాశగుడిసెకు చెందిన షేక్ సిరాజ్(46)కు భార్య జరీన, ముగ్గురు కూతుర్లు, కొడుకు ఉన్నారు. సిరాజ్ కూలీ పనులకు వెళ్తూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాడు. ఆదివారం మద్యం తాగి వచ్చిన సిరాజ్‌ను భార్య జరీన నిలదీయడంతో ఇద్దరి మధ్య వాగ్వాదం నెలకొంది. ఇదే క్రమంలో వీరి చిన్న కూతురు రేష్మ(16) గొడవకు అడ్డువచ్చి తండ్రితో మద్యం తాగొద్దంటూ వాదించింది. దీంతో సిరాజ్ మందలించడంతో మనస్తాపానికి గురైన రేష్మ క్షణికావేశంలో ఇంటి సమీపంలోని వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. ఆమెను కాపాడేందుకు సిరాజ్ సైతం బావిలో దూకగా ఈత రాకపోవడంతో ఇద్దరు మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న బేగంపేట పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. దీంతో కాశగుడిసెలో విషాదచాయలు అలుముకున్నాయి.

జూనియర్ డాక్టర్ల సమ్మె



సిద్దిపేట ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి ఎదుట నిరసన తెలుపుతున్న జూనియర్ డాక్టర్లు

- రెగ్యులర్‌గా స్టైఫండ్ చెల్లించాలి
- దాడులు జరగకుండా రక్షణ కల్పించాలి
- డిమాండ్ల సాధన కోసం పోరాటం
- సిద్దిపేట ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో నిలిచిన సేవలు

సిద్దిపేటకమాన్: తమకు రెగ్యులర్‌గా స్టైఫండ్ చెల్లించాలని, తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని జూనియర్ డాక్టర్లు (జూడాలు) సమ్మెకు దిగారు. అత్యవసర వైద్య సేవలు మినహా, ఇతర వైద్య సేవలను బహిష్కరించి సోమవారం ప్లకార్డులతో నిరసన తెలిపారు.

సమ్మెలో 275 మంది

సిద్దిపేట ప్రభుత్వ మెడికల్ కళాశాలలో 13 విభాగాల్లో 100 మంది విద్యార్థులు పీజీ వైద్య విద్యను చదువుతున్నారు. మరో 175 మంది హౌజ్ సర్జన్స్ ఉన్నారు. ఈ జూనియర్ డాక్టర్లు సిద్దిపేట ప్రభుత్వ మెడికల్ కళాశాలకు అనుబంధంగా కొనసాగుతున్న ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తున్నారు. తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర జూడా అసోసియేషన్ కమిటీ పిలుపు మేరకు సిద్దిపేట ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి జూనియర్ డాక్టర్లు విధులు బహిష్కరించి నిరసన తెలిపారు. అత్యవసర వైద్య సేవలు, ఐసీయూ సేవలు, లేబర్ రూం వైద్య సేవలు మినహా ఇతర వైద్య సేవలను నిలిపివేసి ప్లకార్డులతో ఆస్పత్రి ఎదుట నిరసన వ్యక్తం చేశారు.

పలు డిమాండ్లు

డాక్టర్ల సమస్యల గురించి ప్రభుత్వానికి ఎన్ని సార్లు చెప్పుకున్నా తమను పట్టించుకోవడం లేదని, రెగ్యులర్‌గా స్టైఫండ్ చెల్లించాలని, ఉస్మానియా ఆస్పత్రికి నూతన భవనం నిర్మించాలని, డాక్టర్లపై దాడులు జరగకుండా తమకు రక్షణ కల్పించాలని, వివిధ ఆస్పత్రుల్లో అన్ని రకాల వసతులు, మందులు అందుబాటులో ఉంచాలని, చదువుకునే వైద్యులకు హాస్టల్ వసతి, ఇతర సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. డ్యూటీలో ఉన్న డాక్టర్లకు సరైన భోజనం, తాగునీరు ఏర్పాటు చేయాలని, కళాశాలకు బస్ సౌకర్యం, లైబ్రరీ వంటి సౌకర్యాలు కల్పించాలని కోరారు. ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు వచ్చేంతవరకు ఈ సమ్మె కొనసాగుతుందని జూనియర్ డాక్టర్లు తెలుపుతున్నారు. నిరసనలో జూనియర్ డాక్టర్లు ప్రత్యూష్, పల్లవి, మనోహర్, హేమంత్, శ్రీనివాస్, నితీష్, గోపినాథ్, నికిల్, ఇతర జూనియర్ డాక్టర్లు పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించాలి



మెడికల్ కళాశాలలు, ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యులకు మౌలిక వసతులు కల్పించాలి. ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యులపై దాడులు జరగకుండా రక్షణ కల్పించాలి. ప్రభుత్వాస్పత్రుల్లో పోలీసు అవుట్ పోస్ట్ ఏర్పాటు చేయాలి. తమకు రెగ్యులర్‌గా స్టైఫండ్ చెల్లించాలి. ప్రభుత్వ మెడికల్ కళాశాలలో లైబ్రరీ, ఇతర సదుపాయాలు ఏర్పాటు చేయాలి. తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలి.

– డాక్టర్ పల్లవి, జూనియర్ డాక్టర్

పరిష్కరించే వరకు సమ్మె



ప్రభుత్వం తమకు రెగ్యులర్‌గా స్టైఫండ్ చెల్లించాలి. తమ సమస్యల పరిష్కారం కోసం గతంలో చాలాసార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేదు. తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారం అయ్యేలా ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు వచ్చేంత వరకు సమ్మె కొనసాగిస్తాం. ఉస్మానియా ఆస్పత్రికి నూతన భవనం నిర్మించాలి. జూనియర్ డాక్టర్లపై దాడులు జరగకుండా రక్షణ కల్పించాలి. జూనియర్ డాక్టర్లకు లైబ్రరీ, ఫుడ్, తాగునీరు వంటి ఇతర సౌకర్యాలు కల్పించాలి.

– డాక్టర్ ప్రత్యూష్, జూనియర్ డాక్టర్

ప్రాణహాని ఉంది కాపాడండి

ప్రజావాణిలో ఓ బాధితుడు ఫిర్యాదు

మెదక్ మున్సిపాలిటీ: మా అన్నాదమ్ముళ్ల మధ్య పొలం విషయమై తగాదాలు ఉన్నాయని, ఈ క్రమంలో మా తమ్ముడి భార్య, ఆమె అల్లుడితో పాటు మరికొందరు గొడ్డళ్లు, కర్రలతో దాడులకు వస్తున్నారని, వారితో మాకు ప్రాణ హాని ఉందని మంగలి కిష్టయ్య ఎస్పీని కోరారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో జిల్లా స్థాయి ప్రజావాణి నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ డాక్టర్ బాలస్వామి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. చిలిపిచెడ్ మండలం చిట్కుల్ గ్రామానికి చెందిన మంగలి కిష్టయ్య ఫిర్యాదు చేస్తూ.. తమ గ్రామ శివారులో సొంత పట్టా భూమి ఉందని, ఈ పొలం విషయమై మా తమ్ముడి భార్య మంగలి పద్మ ఇరువురి కుటుంబాల మధ్య ఒరాల సరిహద్దుల విషయంలో తగాదాలు నడుస్తున్నాయని తెలిపారు. ఈ విషయంలో కోర్టులో కేసు కూడా నడుస్తుందని పేర్కొన్నారు. కానీ దౌర్జన్యంగా పద్మ, అల్లుడు, వారి తమ్ముడు మాపై దాడికి గొడ్డళ్లు, కర్రాలతో వస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నట్లు తెలిపారు. వారి వల్ల నాకు ప్రాణ భయం ఉందని, తనకు న్యాయం చేయాలని ఫిర్యాదు చేయగా చట్టప్రకారం ఫిర్యాదుకి తగిన న్యాయం చేయాలని చిలిపిచెడ్ ఎస్‌ఐను ఎస్పీ ఆదేశించారు. వీటితోపాటు మరికొన్ని ఫిర్యాదులు వచ్చాయి. స్పందించి ఎస్పీ చట్టప్రకారం ఫిర్యాదులకు తగిన న్యాయం చేయాలని అధికారులకు సూచించారు.

సైబర్ వలలో ఉద్యోగిని

పటాన్‌చెరు టౌన్: పార్ట్ టైం జాబ్ అంటూ ఫోన్ కు వచ్చిన వాట్సాప్ మెసేజ్ కు స్పందించి ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని నగదు పోగొట్టుకున్న సంఘటన బీడీఎల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పటాన్‌చెరు మండలం ఘనపూర్ గ్రామానికి చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగినికి మార్చి 27 వ తేదీన మెసేజ్ వచ్చింది. ఉద్యోగిని తన వివరాలను నమోదు చేసి ముందుగా రూ.2 వేలు చెల్లించి టాస్కులు పూర్తి చేశారు. బాధితురాలు మొత్తం రూ.11.46 లక్షలు చెల్లించింది. సైబర్ నేరగాళ్లు ఉద్యోగినితో నగదు పెట్టిస్తూ తనకు ఇచ్చిన వాలెట్‌లో నగదుతోపాటు, కమీషన్ చూపిస్తూ వచ్చారు. బాధితురాలు చివరిగా తాను పెట్టిన నగదుతోపాటు కమీషన్ ఇవ్వాలని అడుగగా స్పందించలేదు. దీంతో బాధితురాలు తాను మోసపోయినట్లు గుర్తించి సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేసి, అనంతరం బీడీఎల్ పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

బైండోవర్ ఉల్లంఘన



హుస్నాబాద్: గుడుంబా బైండోవర్ ఉల్లంఘనకు పాల్పడిన వ్యక్తికి జరిమానా విధించినట్లు హుస్నాబాద్ ఎక్సైజ్ సీఐ పవన్ పవన్ తెలిపారు. ఎక్సైజ్ పరిధిలోని కోహెడ మండలం కూరెళ్ల గ్రామానికి చెందిన సంపంగి బాలయ్య గతంలో గుడుంబా అమ్మిన నేరానికి తహసీల్దార్ ఎదుట బైండోవర్ అయ్యాడని తెలిపారు. గుడుంబా మళ్లీ విక్రయిస్తూ బైండోవర్ నిబంధనలు ఉల్లంఘించినందుకు కోహెడ తహసీల్దార్ ఆదేశాల అనుసారం బాలయ్యకు రూ.20 వేల జరిమానా విధించినట్లు సీఐ పేర్కొన్నారు.

రెండు లారీలు ఢీ

టైరు మారుస్తున్న డ్రైవర్ మృతి

కోహెడరూరల్(హుస్నాబాద్): ఆగి ఉన్న లారీని మరో లారీ ఢీకొట్టడంతో వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని శనిగరం రాజీవ్ రహదారిపై చోటు చేసుకుంది. ఎస్‌ఐ తిరుపతి కథనం మేరకు.. లారీలో సిమెంట్ లోడుతో దేవాపూర్ నుంచి చేగుంటకు ఓ లారీ వెళ్తుంది. మార్గమధ్యలో కోహెడ మండలం శనిగరం రాజీవ్ రహదారిపై లారీ టైర్ పగలడంతో డ్రైవర్ విజయ్‌కుమార్ (38) టైర్ మార్చడానికి కిందికి దిగాడు. టైరు మారుస్తున్న క్రమంలో వెనుక నుంచి వచ్చిన మరో లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో విజయ్‌కుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య దాసరి విజయకుమారి ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నడుచుకుంటూ వెళ్తుండగా కారు ఢీ

కౌడిపల్లి(నర్సాపూర్): రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన మండల కేంద్రమైన కౌడిపల్లిలో 765డి జాతీయ రహదారిపై సోమవారం సాయంత్రం చోటు చేసుకుంది. స్థానిక ఎస్‌ఐ రంజిత్‌కుమార్‌రెడ్డి, స్థానికుల కథనం మేరకు.. మండలంలోని ధర్మాసాగర్‌గేట్ తండాకు చెందిన దెవాసోత్ పెంట్యా(45) సొంత పనిపై కౌడిపల్లికి వచ్చి నడుచుకుంటూ తిరిగి ధర్మాసాగర్ గేట్ తండాకు వెళ్తున్నాడు. నర్సాపూర్ వైపు నుంచి మెదక్ వైపు వస్తున్న కారు రాంగ్‌రూట్‌లో వచ్చి పెంట్యాను బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలు కాగా చికిత్స నిమిత్తం 108లో నర్సాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి కొడుకు రాము ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.